

జిల్లాలో పాలన పట్టు తప్పుతోంది!

- అదనపు విధులతో అధికారులపై తీవ్రమవుతున్న ఒత్తిళ్లు
- ఒక్కో అధికారికి నాలుగైదు శాఖల ఇన్‌చార్జి బాధ్యతలు
- సొంత శాఖలపై దృష్టి సారించని అధికారులు
- ప్రత్యేక పాలనలో ప్రజలకు తప్పని ఇబ్బందులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలన పట్టు తప్పుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీ కాలం ముగిసిపోవడంతో అంతటా ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగుతోంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోయి యేడాది గడిచి పోయింది. అలాగే ఇటీవలే మున్సిపల్ పాలక వర్గాల పదవీ కాలం కూడా పూర్తి కావడంతో అంతా ప్రత్యేకాధికారులతోనే పాలనను నెట్టుకొస్తున్నారు. అసలే శాఖపరమైన బాధ్యతలతో సతమతమయ్యే అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఒత్తిళ్లు పెరిగి పోతున్నాయని వాపోతున్నారు. జిల్లాలో ఏ శాఖలో చూసిన అధికారులు బిజీ బిజీగానే కనిపిస్తున్న ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌చార్జి అధికారులకే మళ్లీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. గత కొద్ది రోజులుగా వరుసగా సర్వే పనులు, సంక్షేమ పథకాల అమలు పనుల్లోనే అధికారులు నిమగ్నమవుతున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదంటున్నారు. అసలే వేసవికాలం కావడంతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలుపై దృష్టి సారించలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పర్యవేక్షణ కొరవడడంతో కింది స్థాయి సిబ్బంది చెప్పిందే లెక్కాగా మారుతోంది.

ముఖ్యంగా జిల్లాలో పలు ప్రధాన శాఖలను ఇన్‌చార్జిలతోనే నెట్టుకు రావడంతో పాలన పట్టుతప్పే ప్రమాదం ఉందంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.



అధికారుల ఉరుకులు పరుగులు

ప్రభుత్వం పలు రకాల సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు క్షేత్ర స్థాయిలో సర్వేలు చేపడుతోంది. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇటీవల రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లాంటి పథకాలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో చేపట్టిన సర్వే, లబ్ధిదారుల ఎంపిక జాబితాలు తప్పుల తడకగానే ఉన్నాయన్న విమర్శలు వస్తున్నా యి. అదనపు విధులతో అధికారులపై ఒత్తిళ్లు పెరిగి పోవడంతోనే ప్రభుత్వానికి సరైన నివేదికలు అందడం లేదని తెలుస్తుంది. ఇలాంటి గందరగోళ పరిస్థితులతో అసలైన అర్హులకు కాకుండా అనర్హులకు ప్రభుత్వ పథకాలు అందే అవకాశం ఉందంటున్నారు. అలాగే సరైన గడువులోగా నివేదికలను అందించాలని ప్రభుత్వం ఆదేశిస్తూ హెచ్చరికలు చేయడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. హడావిడిగా తయారు చేస్తున్న నివేదికల్లో లోపాలు, పొరపాట్లు చోటు చేసుకోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల సతమతం

ప్రత్యేక పాలన కొనసాగడంతో కొన్ని శాఖల జిల్లా అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం ముగిసి పోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఉదాహారణకు జిల్లా మార్కెటింగ్ అధికారికి నిర్మల్ జిల్లా ఏడీతో పాటు తలమడుగు మండల స్పెషల్ ఆఫీసర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇలా ఒక్కో అధికారి నాలుగైదు శాఖల విధులను అప్పగించడంతో ఏ శాఖలోను పూర్తి స్థాయిలో పని చేసిన పరిస్థితి కనిపించడం లేదంటున్నారు. అదనపు విధులతో అధికారులు సతమతమవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి కార్యాలయాలకు వస్తున్న ప్రజలకు జిల్లా అధికారి అందుబాటులో లేరని చెప్పడంతో నిరాశగా తిరిగి వెళ్లి పోతున్నారు. కనీసం కొందరు అధికారులు ఫోన్‌లోనైనా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇలా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పనులు పూర్తి కావడం లేదని సామాన్య జనం వాపోతున్నారు. అడిగే వారే లేక పోవడంతో కార్యాలయ సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. అలాగే దీనికి తోడు తరుచు వీడియో, టెలి కాన్ఫరెన్స్‌లు, వివిధ కార్యక్రమాలతో అధికారులు బిజీబిజీగా మారుతున్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ

ఇన్‌చార్జి బాధ్యతలు, అదనపు విధులతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలుసొంత శాఖల పని తీరుపైననే దృష్టి సారించలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడడం చూస్తుంటే ఆ శాఖ పనితీరు పై పలురకాల విమర్శలు వస్తున్నాయి. జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మధుకర్‌కు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ బాధ్యతలను అప్పగించి బలి చేశారన్న ఆరోపణలు లేక పోలేదు. కేవలం పని ఒత్తిడి కారణంగానే సొంత శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలను పసిగట్టలేక పోయారన్న చర్చ జరుగుతుంది. అదనపు విధులతో సొంత శాఖ పనుల పై కొంత నిర్లక్ష్యమే కనిపిస్తుంది. ఇటీవల సీసీఐ పత్తి కొనుగోళ్లలో అవినీతి అక్రమాలు జరిగాయంటూ వార్తలు రావడం శాఖ ఉన్నతాధికారులకు ముందు చూపు కొరవడడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. బోథ్ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ స్వామికి జిల్లా అధికారిగా బాధ్యతలు అప్పగించారు. దీంతో శాఖలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిని పసిగట్టలేక పోవడంతోనే పాలన గాడితప్పుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని, గిరిజన సంక్షేమ పాఠశాల, గిరిజన గ్రామాల్లో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను పెండింగ్‌లో పెట్టకూడదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పీవో క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాదవ్ తానాజీతో కలిసి ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఈఈలు, ఏఈఈలతో నిర్వహించిన సమావేశంలో పనులను సమీక్షించారు. ఆశ్రమ పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో చేపట్టిన గేట్ల మరమ్మతుల పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. పగిలిపోయిన కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆదర్శ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు, డార్మటరీ గదులు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఈలు, శివప్రసాద్, సతీష్, ఈలు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి

- పీవోకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుల వినతి



పీవోకు వినతి పత్రం అందజేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బేల మండల కేంద్రంలో సర్వే నెంబర్ 29/ఏలోని భూమి కేసును వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు సిడాంనందుకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్‌మకి రామా రావులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కోరారు. శుక్రవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం చాంబర్‌లో పీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. బేల మండలంలోని బురాన్‌పూర్‌లో సర్వే నంబర్ 29/ఏ ఏజెన్సీ పరిధిలో వస్తుందని, ఈ భూమిని ప్లాటుగా చేసి ఒక వ్యక్తి అమ్ముతుండగా 1/70 చట్టం ఉందని పేర్కొంటూ 2021లో కేసు వేశామన్నారు. దీనిపై గిరిజనేతరుడు ఒకరు హైకోర్టు నుంచి స్టేటస్కో ఉత్తర్వులు తేవడంతో దానిని తొలగించేలా తాము ప్రయత్నం చేసి స్టేటస్కో ఉత్తర్వులను రద్దు చేయించామన్నారు. ఈ భూమిలో అక్రమంగా ఇళ్లు, భవనాలు, నిర్మిస్తున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఈ కేసును త్వరితగతంగా పరిష్కరించి ఏజెన్సీ చట్టాలను కాపాడాలని కోరినట్లు వారు వివరించారు. సత్వర కేసు పరిష్కారం కాకుంటే బేల మండల కేంద్రంలో ఆదివాసుల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. వారి వెంట కోరింగ సోనేరావు, కొడప రవీందర్, ఆత్రం ఫక్కు, కొడప అరుణ్, నానాజిలు ఉన్నారు.



ఉత్తర్వులను అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

డీసీసీబీ పాలక వర్గ పదవీ కాలం పొడిగింపు

- ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ పాలక వర్గ పదవి కాలాన్ని పొడగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉత్తర్వులను జారీ చేశారు. శనివారంతో డీసీసీబీ పదవీ కాలం ముగిసి పోనుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 9 డీసీసీబీ పాలక వర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు మాసాల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసబీ ఛైర్మన్ అడ్డిభోజారెడ్డితో పాటు మరో 21 మంది డైరెక్టర్లు పదవుల్లో కొనసాగుతారు. ఆగస్టు 15 వరకు పదవీ కాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డితో పాటు పలువురు డైరెక్టర్లు బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అయితే డీసీసీబీ పాలక వర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు మాసాల పాటు పొడగిస్తారని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది.

మొక్కలు నాటి సెల్ఫీ దిగిన ఎమ్మెల్యే



మొక్క నాటి సెల్ఫీ దిగుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా శుక్రవారం నుంచి రాష్ట్ర మంతటా మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ నిర్వహిస్తున్న 'మూడు మొక్కలు నాటండి.. సెల్ఫీ దిగండి' కార్యక్రమంలో భాగంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నాయకులతో కలిసి మూడు మొక్కలు నాటి సెల్ఫీ దిగారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజక వర్గంలో ప్రతీ ఒక్క కార్యకర్త కేసీఆర్ జన్మదిన సందర్భంగా మూడు మొక్కలు నాటి సెల్ఫీ దిగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, నేరడిగొండ మండల కన్వీనర్ శివారెడ్డితో పాటు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి గుబ్బా గ్రామస్థులు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని గుబ్బ గ్రామస్థులు శుక్రవారం మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గ్రామస్థులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, విజయ్‌రెడ్డి, గణేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నార్నూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం నార్నూర్ మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యేను మాజీ సర్పంచ్ బిగజానంద్ నాయక్ వారి స్వగృహానికి ఆహ్వానించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తను ఆదుకుంటామని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధికంగా మెజార్టీ స్థానాలు గెలిచేలా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి దేవాదాయ శాఖ మంత్రితో మాట్లాడి అభివృద్ధికి పనులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు దేవరావు లోకండే, కాంతారావు, కరీం ఖాన్, షేక్ దాదేలి, చవాన్ గోవిందరావు, జక్రుల్లా ఖాన్, కార్తీక్, రాథోడ్ కోరల మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి..

ఉట్నూర్: నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండ గా నిలుస్తుంద ని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

ఉట్నూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ షమీమ్ అక్తర్‌కి, మంత్రివర్గ ఉప సంఘం కమిటీ ఛైర్మన్, సభ్యులకు, ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవంగా క్యాబినెట్ అసెంబ్లీ ఆమోదం తెలిపిన సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌ని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం కలిసి సన్మా నించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలి యజేసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మాదిగ నాయకులు లింగపల్లి చంద్రయ్య, బిరుదుల లాజర్, అరకిల్లా అశోక్, కొల్లూరి స్వామి, అరకిల్లా పరమేశ్వర రావ్, హన్మంతు డాక్టర్, గవాలే సతీష్, వాఘ్మారే కిరణ్, యదుకుర్తె రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో అమరవీరుల త్యాగాలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



పొనాలలో పుల్వామా అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. దాడిలో అమరులైన జవాన్‌లకు ఆయన ఘన నివాళి సమర్పించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కార్గిల్ పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. దేశ ప్రజల రక్షణ కోసం ఆర్మీ జవాన్‌లు నిరంతరం సేవలు అందిస్తున్నారని తెలిపారు. అలాగే సనాతన హిందూ ఉత్సవ సమితి, మాజీ సైనికుల ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. కొవ్వొత్తులు వెలిగించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, కందుల రవీందర్, రేణికుంట్ల రవీందర్, మాజీ సైనికులు శంకర్ దాస్, మజార్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు యువకుల నివాళులు

బోథ్: జమ్ము కశ్మీర్‌లో 2019లో ఫిబ్రవరి 14న సైనిక వాహనంపై దుండగులు కారుబాంబుతో దాడి చేయడంతో అందులో మృతిచెందిన 40మంది సీఆర్పీయస్ సైనికులకు శుక్రవారం పొనాలలో నివాళులు అర్పించారు. నవనిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రజా రక్షణ కోసం ఆర్మీ జవాన్‌లు నిరంతరం సేవలు అందిస్తున్నారని తెలిపారు.



పార్టీ కండువా కప్పుతున్న ఆడే గజేందర్

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు

నేరడిగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గజ్జల అశోక్ కాంగ్రెస్ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం చేసిందని అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో సింగారపు స్వామి, సుంకభీమన్న, మాదుగంపల్లి గంగాధర్, బొర్గెడి సతీష్, బాయ్ మహేష్ తదితరులున్నారు.



పర్సు పోవడంతో విలపిస్తున్న యువతి

బస్సులో పర్సు చోరీ

- రూ. 50 వేల అపహరణ

ఇచ్చోడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కెంద్రె కేరబాయి అనే యువతి పర్సు ఆర్టీసీ బస్సులో చోరీకి గురైంది. అందులోని రూ.50వేలు అపహరణకు గురికావడంతో యువతి బోరున విలపించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఎక్కి ఆదిలాబాద్ పట్టణంలో ఉంటున్న తన అన్న ఇంటికి కేరబాయి వెళ్లింది. అనంతరం తన వెంట తెచ్చుకున్న బ్యాగు ను తెరిచి చూడగా బ్యాగులో ఉన్న పర్సు కనిపించలేదు. దీంతో యువతి బోరున విలపించింది. అనంతరం యువతి సోదరుడు చోరీ ఘటనపై ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆర్టీఏ పరిధిలోని సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

ఉట్నూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రోడ్డు రవాణా సంస్థ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని ఆదిలాబాద్ ఆర్టీఏ సభ్యుడు దూట రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలోని రవాణ శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి సన్మానించామని తెలిపారు. సచివాలయం సమావేశ మందిరంలో మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఆర్టీఏ సభ్యుల సమావేశంలో జిల్లా సభ్యులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. మీ ఆర్టీఏ పరిధిలోని సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న దృశ్యం

చిల్లర నాణేలతో సమాజసేవ



స్థానికులకు చిల్లరనాణాలు అందజేస్తున్న వ్యాపారి నాగరాజు

డబ్బు బలం ఉంటేనే సమాజ సేవ చేయవచ్చన్న ఆలోచనను ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నాగరాజు అనే వ్యాపారి తప్పని నిరూపిస్తున్నాడు. సేవ చేయాలన్న సంకల్పం ఉంటే ఏ దారిలోనైనా సమాజానికి అండగా నిలవచ్చని నిరూపిస్తున్నాడు. స్థానిక గాంధీ చౌక్‌లో బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారి నాగరాజ్. రైతు బజార్‌లో చిల్లర నగదు కోసం రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించాడు. ప్రతి వెయ్యి రూపాయలకు కొంత నగదును కమీషన్‌గా తీసుకుని చిల్లర ఇస్తున్నారని, తద్వారా కొందరు వ్యాపారులు అమాయక రైతుల నుంచి కమిషన్‌ను తీసుకుంటున్నారని తెలుసుకున్నాడు. అనుకున్నదే తడవుగా బ్యాంకు అధికారులను సంప్రదించి ప్రతీరోజు పదివేల రూపాయల చిల్లర నాణేలను తీసుకుని వాటిని ఉదయం రైతు బజార్‌లో ఎటువంటి కమీషన్ లేకుండానే రైతులకు, అవసరమైన వినియోగదారులకు అందిస్తున్నాడు. తనకు తెలిసిన వ్యాపారులు సైతం ఆయనకు చిల్లర నాణేలను అందిస్తూ చిరుసేవలో భాగస్వాములు అవుతున్నారు. తన పెళ్లి రోజు నాటి నుంచి ఈ సేవ ప్రారంభించానని, కూరగాయలు అమ్ముకునే రైతుల ఇబ్బందులను గుర్తించి వారికి చిల్లర నాణెలు అందిస్తున్నట్లు నాగరాజ్ తెలిపారు.

(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫోటోగ్రాఫర్)

టికెట్టుకు సరిపడా చిల్లర లేక ప్రయాణికుడిని
బస్సు దింపివేసిన కండక్టర్

బోథ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కనుగుట్ట గ్రామానికి చెందిన కైపెల్లి భోజన్న అనే ప్రయాణికుడు పొచ్చెర క్రాస్‌రోడ్డు వరకు వెళ్తానని బోథ్‌లో బస్సు ఎక్కాడు. అయితే బస్సులో టికెట్టు కోసం 100 రూపాయల నోటును సదరు కండక్టర్‌కు ఇచ్చి పొచ్చెర క్రాస్‌రోడ్ వరకు టికెట్ ఇవ్వాలని కండక్టర్‌ను కోరారు. పది రూపాయల టికెట్ కోసం వంద రూపాయల చిల్లర లేదంటూ కండక్టర్ బోథ్ పట్టణానికి కిలో మీటర్ దూరంలో ఆయనను దింపి వేశాడు. బస్సు దిగిన ప్రయాణికుడు చిల్లర లేక పోవడంతో తనను బస్సులో నుంచి దించేశాడని తిట్టుకుంటూ నడవడం మొదలు పెట్టాడు. ఉచిత ప్రయాణం చేస్తున్న వారు టికెట్టు డబ్బులు ఇవ్వక పోవడం వల్ల తనకు ఈ దుస్థితి నెలకొందని కండక్టర్ అంటున్నాడని పలకరించిన వారి దగ్గర వాపోయాడు. ఏది ఏమైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల డబ్బులు చెల్లించిన పురుషులకు కండక్టర్ల వద్ద చిల్లర లేక పోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి

నేరడగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కుంభమేళ నుంచి తమిళనాడుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మండలంలోని లింగట్ల బస్టాప్ దగ్గర శుక్రవారం ఉదయం ద్విచక్ర వెనుకటైర్ పగిలి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టగా తమిళనాడుకు చెందిన రాజేశ్ 42 అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. అతి వేగం అజాగ్రత్తగా ద్విచక్ర వానం నడపడం వలన వెనుక టైర్ పగిలి అదుపు తప్పి డీవైడర్‌ను ఢీకొనగా కాలికి, మర్మాంగాలకు దెబ్బలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

డిగ్రీ కళాశాలలో అలరించిన నృత్యాలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫార్మేషన్‌డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం మాజీ ప్రిన్సిపల్‌ను సన్మానించారు. అలాగే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బ్లడ్ క్యాంప్ నిర్వహించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించాలని జేసీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు గణ్ఎతి, ఎస్సీసీ కేర్ టేకర్ అధికారి చంద్రకాంత్, ఎస్సీసీ ప్రోగ్రాం అధికారులు పృథ్వీరాజ్, యాకూబ్ అలీ, కోటయ్య, రేఖ, అనిత, స్వప్న, ముబారక్, గోపాల్, నరేష్, శ్రీనివాస్, బోధన బోధనేతర సిబ్బంది క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి'

భైంసా , ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు, సంపూర్ణ ఆరోగ్యం కోసంగాను చదువుతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని భైంసా డాక్టర్స్ అసోషియేషన్ అధ్యక్షులు డా. దామోదర్‌రెడ్డి, ఎంసీటీ చైర్మన్ డా. నాగేష్, ఆరోగ్య భారతి జిల్లా సంయోజక్ డా. రామకృష్ణగౌడ్, విహెచ్‌బీ ప్రతినిధి డా. మహిపాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధి డా. ముత్యంరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీడీసీ ఆధ్వర్యంలో భైంసా డాక్టర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధమైన విధానాలతో సమయపాలన పాటిస్తూ పరీక్షలకు సన్నద్ధమవ్వాలన్నారు. మనో ధైర్యంతో వ్యవహరిస్తూ పీరక్షలపై భయాందోళనలను వీడనాడి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు నిత్యం క్రమం తప్పకుండా నడక, వ్యాయమం చేయాలన్నారు. ఇదే క్రమంలో కొద్దిపాటి సమయాన్ని జ్ఞానం కోసం కేటాయించాలన్నారు. అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు గాను వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఏరియాసుపత్రి స్త్రీ వైద్య నిపుణురాలు డా. పద్మావతి, ఆరాధన ఆసుపత్రి వైద్యురాలు డా. స్నేహారెడ్డిలు యువతులు పాటించాల్సిన ఆరోగ్య రక్షణ చర్యలను విషదీకరించి చైతన్య పరిచారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ బుచ్చయ్య, సీపీడీసీ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, డైరెక్టర్ భోస్లే భాజీరావుపటేల్, భైంసా డైరెక్టర్స్ అసోషియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టంపై విద్యార్థులకు అవగాహన

పెంబి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బాలశక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రతపై, తదితర బ్యాకింగ్ అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ మాట్లాడుతూ... విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచే ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రత, బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నిత్య జీవిత కార్యకలాపాల్లో భాగంగా బ్యాంకులో అందించు వివిధ సేవలు, బ్యాంకులో అందించు రుణాలు, రిజర్వ్ బ్యాంకు పని తీరు, అన్ని రకాల ఫారముల గురించి వివరాలను విద్యార్థులకు తెలిపారు. నేటి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో విద్యార్థులంతా సైబర్ భద్రతకు సంబంధించి అంశాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నరసింహా రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సదా.. గోమాత సేవలో..

- గోవులకు చికిత్స చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు
- దశాబ్ద కాలంగా సేవలో గోమాత ఫౌండేషన్
- గోమాతకు చికిత్సలు, అంత్యక్రియలు
- ఆదర్శంగా గో సంరక్షణ యువకులు

ఆదర్శం



ఆవుకు చికిత్స చేస్తున్న గోమాత ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సమాజంలో సాటి మనిషినీ పట్టించుకోని రోజులివి. ఈ నేపథ్యంలో కొందరు యువకులు ఒక సమూహంగా ఏర్పడి గోమాత ఫౌండేషన్ స్థాపించారు. దశాబ్ద కాలంలో గోమాత సేవలో 24 గంటలపాటు తమ బాధ్యత నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సురేష్, జగన్, సామికృష్ణ, పృథ్విరాజ్, హేమాంశ్, పవన్, సంతోష్, రాజశేఖర్, రాజా రెడ్డి మంచి మిత్రులు. వీరి భావాలు ఒక్కటిగా ఉండడంతో ఈ సేవను ఎంచు కున్నారు. దశాబ్ద కాలంగా దాదాపు 2000 గోమాతలకు చికిత్స అందజేశారు. 1700 గోమాతలకు అంత్య క్రియలు నిర్వహించారు.

చికిత్స నుంచి అంత్యక్రియల వరకు

ఈ ఫౌండేషన్ వారు ఎక్కడైనా గోవులు, లేగ దూడలు గాయపడినా సమాచారం అందిన వెంటనే స్పందించి సొంత వాటిని సొంత ఖర్చులతో వాటిని పశు వైద్యశాలలకు చేర్చుతారు. లేదా సంఘటనా స్థలంకే పశు వైద్యులను తీసుకెళ్లి చికిత్స చేయిస్తారు. ఇక రోడ్లపై అలా గడ్డిగ్రాసం లేక తిరిగే గోమాతలను గోశాలకు తరలిస్తారు. అవి పట్టణంలో పోస్టర్లు, ప్లాస్టిక్ తినకుండా చూస్తున్నారు. రోడ్లపై గోవులకు ఇతర పశువులకు ప్రమాదాలు జరగకుండా వాటి యజమాని గురించి తెలుసుకుని అవగాహన కల్పిస్తారు.

కరోనా కాలంలో విస్తృత సేవలు

కరోనా సమయంలో మనిషే మనిషితో మాట్లాడే అవకాశం లేదు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఈ ఫౌండేషన్ గోవులు, పశువులకు గ్రాసం అందజేసింది. ఎండాకాలం వాటి దాహార్తి తీర్చడానికి అక్కడక్కడ నీటి తొట్టెలను ఏర్పాటు చేసింది. పట్టణం అంతా తిరిగి ఇలాంటి గోవుల సంరక్షణ చేశారు. ఎక్కడైనా గోవులు మృతి చెందాయని సమాచారం తెలిస్తే ఈ ఫౌండేషన్ వారు అర్థ రాత్రి అయినా అక్కడికి వెళ్తారు. గోమాతలకు సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు చేస్తారు.

ఈ సేవలో సంతృప్తి ఉంది

సురేష్ హొటార్‌కర్,
ఫౌండేషన్ అధ్యక్షులు ఆదిలాబాద్



మేము మా సొంత ఖర్చులతో ఈ ఫౌండేషన్ ద్వారా గో సేవ లో ఉన్నాం. ఎక్కడైనా గోవులు, లేగ దూడలు ఆకలి కనిపిస్తే తక్షణం వాటికి అవసరమైన మేత అందిస్తాం. రోడ్లపై ప్రమాదవపుటంచులో ఉండే ఆవులను ఇత ర పశువులను గోశాలకు తరలిస్తాం. యజమాని ఆచూకీ దొరికితే వారికి అవగాహన కల్పిస్తాం. భారత సంస్కృతిలో గోమాత స్థానం అమూల్యం. ఈ సేవలోనే మాకు సంతృప్తి కనిపిస్తుంది. కబేళాలకు తరలే సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇచ్చి అడ్డు కుంటాం. గోమాత సంరక్షణ విషయంలో ఏ సమయంలోనైనా 9666793455కు సమాచారం ఇవ్వొచ్చు.



అంత్యక్రియలు చేస్తున్న గోమాత ఫౌండేషన్ (ఫైల్)

ఎన్ని పనులున్నా గోమాత సేవకే ప్రాధాన్యం

సాయిక్రిష్ణ,
గోమాత ఫౌండేషన్ ప్రతినిధి, ఆదిలాబాద్



మా ఫౌండేషన్ 24 గంటలపాటు గోమాత సేవకు అంకితమైంది. మాకు కుటుంబ, మా జీవనో పాధులకు సంబంధించి ఏ పనులు ఉన్న ముందుగా గోమాత సంరక్షణకే ప్రాధాన్యత ఇస్తాం. గోవుల పోషకులు, గ్రామాల్లో గోవుల పెంపకం కష్టం అనిపించేవారు తప్పకుండా మమ్మల్ని సంప్రదిస్తే తగు న్యాయం చేస్తాం.

గోమాత సేవలు బాగున్నాయి

రవికాంత్ యాదవ్, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌లో గోమాత ఫౌండేషన్ సేవలు బాగున్నాయి. నిజానికి గ్రామాల్లో కొందరు రైతులు గోవులను సంరక్షించలేక ఇబ్బంది పడతున్నారు. అక్కడక్కడ గోమాతలు అనాథల్లా మృతి చెంది కినిపిస్తాయి. అలాంటి వాటికి ఈ ఫౌండేషన్ సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు చేయడం హర్షనీయం.

ఆర్ఎఫ్ఆర్ సమస్యలకు త్వరలో పరిష్కారం

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా



ఉట్నూర్‌లో జరిగిన పైలెట్ ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): అటవీహక్కు పత్రాలలో ఏవైనా పొరపాట్లు జరిగితే త్వరలోనే పరిష్కరిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీఓ రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రజావాణి కార్యక్రమానికి పీఓ హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు అటవీహక్కు పత్రాలలో దొర్లిన తప్పుల గురించి ప్రజావాణి దృష్టికి తీసుకు రాగా ప్రభుత్వం నుంచి లాగిన్ వస్తుందని త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, తప్పులు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన పైలట్ ప్రజావాణి కార్యక్రమానికి 144 మంది దరఖాస్తులు చేసుకున్నారు. పంట రుణమాఫీ కావడం లేదని కొందరు తెలుపగా కుటుంబ సభ్యుల్లో ఎవరైనా రెండు లక్షలు దాటి పంట రుణం పొందినట్లయితే వారికి మాఫీ కాలేదని ప్రభుత్వం త్వరలోనే ఈ సమస్య పరిష్కరిస్తుందని వ్యవసాయ అధికారి తెలిపారు. సదరం సర్టిఫికేట్ ఉన్నరాజశేఖర్ అనే యువకుడికి దివ్యాంగుల పింఛన్ రావడం లేదని ప్రజావాణికి తెలిపారు. గతంలో వినికిడి లోపం 52 శాతం దాటి ఉండడంతో వచ్చిందని, తిరిగి కొత్త సదరం సర్టిఫికేట్ ఇవ్వక పోవడం వల్ల 47శాతం చూపిస్తున్నందున దివ్యాంగుల పింఛన్ రావడం లేదని మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాంప్రసాద్ సూచించారు. మరికొందరు ప్రభుత్వం ప్రకటించిన గ్యాస్ సబ్సిడీ రావడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల అధికారులు మాట్లాడుతూ ఇలాంటి కేసులు చాలా ఉన్నాయని ప్రభుత్వం నుంచి సబ్సిడీ మంజూరు కావాల్సి ఉంటుందని తెలుపగా ప్రత్యేక అధికారి సుధాకర్ జోక్యం చేసుకుని ముందుగా ప్రజావాణికి వచ్చిన వినతులను పరిష్కరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు, గ్రామ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాలి
హీరా సుఖ జయంతి ఉత్సవంలో పీఓ

ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువకులు ఉపాధి శిక్షణలో పొంది దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసేలా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం మండంలోని లింగోజి తండా ఎక్స్‌రోడ్డులో ఆదివాసీ పురోహిత్ ప్రార్థన సమాజ్ సంఘ ఉట్నూర్ డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొండి ధర్మ గురు హిరాసుక జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణలు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నామన్నారు. కొన్ని కంపెనీలు సైతం శిక్షణలు ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి అవకాశాలు కల్పిస్తున్నందున నిరుద్యోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థులు చదువుల్లో రాణించాలని, అప్పుడే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. ఐటీడీఏ పీవీటీజీ ఏపీఓ మేస్రం మనోహర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులందరు సంస్కృతి సాంప్రదాయాలను మరవకుండా పెండ్లి కార్యక్రమాలను నిర్వహించుకో వాలని, కొంత మంది హల్దీ కార్యక్రమాలతో పాటు అడ్వాన్స్ ఫోటో షూటింగ్‌లు చేస్తూ సంస్కృతికి విఘాతం కలిగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆదివాసీ గిరిజనులందరు తమ పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతి సాంప్రదాయాలను తూచా తప్పకుండా పాటిస్తూ భావితరాలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గొళలం నీరంజన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మడావి లక్ష్మణ్, అరక సంతోష్, దత్తు, బాలాజి, గంగాసాగర్, సిడాం భీమ్‌రావు, మేస్రం కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన సీఆర్టీలను విధుల్లోకి తీసునేందుకు పరిశీలిస్తా

ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తొలగించిన ఐదుగురు సీఆర్టీలను విధుల్లోకి తీసుకునేలా పరిశీలిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా హామీ ఇచ్చారని పీఆర్టీయూ కొమురంభీం జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. పోచంలొద్దికి చెందిన సంజీవ్, మొగుడ్‌దగడ్ గురుడుపేటకు చెందిన శార, బెల్లంపల్లికి చెందిన సురేష్, పిప్రిజరిగి చెందిన మనోజ్,సావిరికి చెందిన మనోజ్ కుమార్‌లు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో ఐదుగురిని విధుల నుంచి తొలగించారన్నారు. 15 ఏళ్లుగా సీఆర్టీలుగా పని చేస్తున్నందున తప్పులు క్షమించి విధులకు తీసుకోవాలని త్వరగా పరిశీలిస్తామన్నారని ప్రకాష్ తెలిపారు.

ఆకాశవాణిలో కిసాన్‌వాణి.. నేడు రేడియోలో కిసాన్ దివస్



ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దేశానికి అన్నం పెట్టేది రైతులు అలాంటి రైతుల సేవలో ఆకాశవాణి ఎన్నో వినూత్న కార్యక్రమాలను రూపొందించింది ప్రసారం చేస్తోంది. విద్యార్థులు, యువకులు, మహిళలు, రైతులకు ఉపయోగపడేలా ఎన్నో కార్యక్రమాలను రూపొందించింది ప్రసారం చేస్తోంది. ఇల్లు వాకిలి శీర్షికన రైతు కార్యక్రమాలను ప్రసారం చేస్తున్న ఆకాశవాణి 2015వ సంవత్సరం నుంచి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సౌజన్యం కిసాన్ వాణి కార్యక్రమాల ప్రసారానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాలను ప్రారంభించిన ఫిబ్రవరి 15వ తేదీ రేడియో దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం కూడా ప్రతి యేటా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. కొన్ని సంవత్సరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదర్శ రైతులతో పాటు వారికి సేవలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను గుర్తించి వారిని ఈ రేడియో కిసాన్ దినోత్సవం సందర్భంగా సత్కరిస్తోంది. అయితే రైతుల కోసం నిరంతరం కార్యక్రమాలను ప్రసారం చేస్తోందని ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ముఖ్య కార్యక్రమాధికారి కె.రామేశ్వర్ తెలిపారు. రైతులకు సాగులో అవసరమైన మెళకులను, సాగు పద్ధతులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు అందిస్తున్నామని వివరించారు. సమయంలో కార్యక్రమాలను వినలేని శ్రోతల సౌలభ్యం కోసం ఈ కార్యక్రమాలను ఆకాశవాణి యూట్యూబ్ ఛానెల్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతుల కోసం ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ప్రసారం చేస్తున్న కిసాన్ వాణి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేత

కుంటాల, ఫిబ్రవరి, 14 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని కల్లూరు గ్రామానికి చెందిన వైద్యులు సైక్రియాట్రిస్ట్ సుధీర్‌కుమార్ మనోవైద్య హాస్పిటల్ నిర్మల్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షల్లో ప్రశాంతంగా పాల్గొనాలని, పరీక్షలంటే భయపడకుండా ముందస్తు ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అంతేగాకుండా తన స్వగ్రామమైన కల్లూరు పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఎలాంటి అవసరాన్నైనా తీర్చేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిషన్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని వినతి

కడెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో క్రైస్తవ స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని తహసీల్దార్ ప్రభాకర్‌కు శుక్రవారం కడెం క్రైస్తవులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సర్వే నెంబర్ 35లో ఉన్న రెండుఎకరాల స్థలాన్ని క్రైస్తవ స్మశాన వాటికకు కేటాయించాలని కోరారు.

విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం మానుకోవాలి : పీడీఎస్‌యూ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం మానుకొని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు గడిచినా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం దారుణమని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే విడుదల చేయాలని లేనట్లయితే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, విరాజ్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేరడిగొండలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

నేరడిగొండ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న తెలంగాణ రాష్ట్ర సాధకులు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా బోథ్ నియోజక వర్గంలో నిర్వహించే జన్మదిన వేడుకల గురించి చర్చించుటకై నియోజక వర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు నేడు శనివారం మధ్యాహ్నం 3గంటలకు నేరడిగొండ ఎమ్మెల్యే నివాసానికి రావాల్సిందిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు.

బోథ్ గ్రామ అభివృద్ధి కమిటీ రద్దు

బోథ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): బోథ్ పట్టణ అభివృద్ధి కమిటీ కార్యవర్గ రద్దయింది. నూతన కార్యవర్గం ఏర్పాటును త్వరలో చేయడం జరుగుతుందని అంత వరకు తాత్కాలిక కమిటీ పని చేస్తుందని అభివృద్ధి కమిటీ వారు తెలిపారు.

నేటి నుంచి కుల ధృవీకరణ పత్రాలు జారీ

బోథ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ద్వారా కుల ఆదాయ నివాస ధృవీకరణ పత్రాలను జారీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ మల్లేష్ తెలిపారు. మండల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు పై అడ్డంగాపడ్డ చెట్టును తొలగించిన పోలీసులు



పొచ్చెర జలపాతం బస్టాండ్ సమీపంలో రోడ్డు పై పడ్డ చెట్టు

బోథ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం బస్టాండ్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా శుక్రవారం తెల్లవారు జామున పెద్ద చెట్టు పడిపోయింది. దీంతో ప్రజలకు వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు తెలెత్తాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు 100 డయల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు. సకాలంలో పోలీసులు స్పందంచడంతో స్థానికులు పోలీసుల పని తీరును అభినందించారు.

ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి



ప్రాక్టికల్ పరీక్షలను తనిఖీ చేస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

బోథ్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల వాగ్దేవి కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆయా కళాశాలలోని సెంటర్లను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ పరిశీలించారు. పరీక్షలలో అవకతవకలకు తావులేకుండాచూడాలని సిబ్బందిని ఆదేశించారు.

పోస్టల్ సమస్యల పరిష్కారం కోసమే
డాక్ అదాలత్‌లు

- పోస్ట్ ఆఫీసెస్ సూపరింటెండెంట్ సిద్ధార్థ

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ సేవలకు సంబంధించిన సమస్యల పైన అలాగే ప్రజల ఫిర్యాదులు, అభిప్రాయాల పైన అర్జీలు తీసుకొని వాటిని పరిష్కరించేందు కోసం జిల్లా వ్యాప్తంగా డాక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోస్ట్ ఆఫీసెస్ సూపరిం టెండెంట్ డి. సిద్ధార్థ తెలిపారు. మార్చి నెల 25 నుండి గూగుల్ మీట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. కాగా ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కుమరం భీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజల నుంచి పోస్టల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను మార్చి 7వ తేదీ వరకు స్టాఫ్ అండ్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్ పేరిట పంపాలని కోరారు. ఫిర్యాదుదారులు తమ సెల్ ఫోన్ నెంబర్‌ను, మెయిన్ ఐడీని ఫిర్యాదులో పేర్కొనాలని సూచించారు.

జర దేఖో!!


రాజుర గ్రామ శివారులో పగుళ్లు తేలిన నీటి తొట్టి

మూగ జీవాల దప్పిక తీరేదెలా..!?

కుభీర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభానికి ముందే జల వనరుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. విరివిగా నీటి వినియోగంతో భూగర్భ జలాలు తగ్గుతూ వస్తున్నాయి. అడవుల్లో నీటి కుంటలు, వాగులు, వంకలు చాలా వరకు ఎండిపోయాయి. అడవులతో పాటు గ్రామశివారుల్లో పశుగ్రాసం ఎండు ముఖం పడుతోంది. ఫలితంగా మూగ జీవాల ఆకలి దప్పికలను తీర్చేందుకు కాపర్లు ముప్పు తిప్పలు పడుతున్నారు. వేసవిలో మూగజీవాలకు తాగు నీటి ఇబ్బందులు కలగొద్దని, శుభ్రమైన తాగు నీరు అందించాలని ప్రభుత్వం జాతీయ ఉపాధిహామి పథకం, ఇతర నిధులతో నివాస ప్రాంతాల్లో, పశువులకు తొట్టిలను నిర్మించింది. వీటికి బోరు బావులు, కుళాయిల ద్వారా నీటి సరఫర జరిగేలా ఏర్పాట్లు చేశారు. మొదట్లో విటీ నిర్వాహణ బాగున్న ఆ తర్వాత వీటి గురించి పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి. కుభీర్ మండలంలోని 41గ్రామపంచాయతీ గ్రామాల్లో పశువుల సంఖ్య అవసరాన్ని బట్టి ఒకటి రెండు నిర్మించారు. మరికొన్ని నాబార్డు పథకంలో నిర్మించారు. మండలంలో మొత్తం దాదాపు 60వరకు తొట్టిలను నిర్మించారు. గతంలో వీటి ద్వారా మూగ జీవాలు దాహర్తి తీర్చుకున్నాయి. ఇప్పుడు వాటి నిర్వాహణ పట్టించుకోక పోవడంతో సగానికి పైగా పగిలి పోయాయి. మరికొన్నిటికి నీటి సరఫర లేదు. ఈ నేపథ్యంలో పశువుల దాహర్తి తీర్చేందుకు శిథిలమైన నీటి తొట్టిలను మరమ్మత్తులు చేసి తాగు నీటి సరఫరా అయ్యే విధంగా ఏర్పాటు చేయాలని పశు పోషకులు రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శిథిలమైన తొట్టిలకు మరమ్మతులు చేపట్టి, పశువులకు నీరందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కుభీర్ శివసాయి ఆలయం ముందు పూర్తిగా శిథిలమైన నీటి తొట్టి

ప్రమాదకరంగా రహదారి

కుభీర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయం నుంచి వివేకానంద స్వామి చౌరస్తా వరకున్న ప్రధాన రహదారి గుంతలుగా పడి ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రంలోని హ్మశాన వాటిక నుంచి బెల్గాం గ్రామం మీదుగా సరిహద్దు మహారాష్ట్ర, ధార్‌కుభీర్ గ్రామశివారులో వాగుపై వంతెన నిర్మాణ పనుల కోసం పరిమితికి మించిన కంకర, గ్రావెల్‌మట్టి టిప్పర్లు, భారీ వాహనాలు తిరగడంతో రహదారి అధ్వానంగా తయారైందని మండల వాసులంటున్నారు. ఈ రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. మండలంలోని గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కుభీర్‌కు రావాలంటే ఇదే ప్రధాన రహదారి అయినందున రోజు వందలాది వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


వైన్స్ సమీపంలో గుంతలుగా మారిన రహదారి


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్ల యోధులు




కుస్తీలను తిలకిస్తున్న భక్తులు

వైభవంగా ఎడ్‌బిడ్ మల్లన్న జాతర

● భారీగా తరలివచ్చిన భక్తజనం ● కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్ల యోధులు
● అలరించిన ఉత్సవాలు

ముథోల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న దేవుడి జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. నిర్మల్ జిల్లా నుండి కాకుండా ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మహారాష్ట్ర నుంచి సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. కోరిన కోరికలను తీర్చాలని నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. మొక్కిన మొక్కులు ఫలించడంతో కొందరు భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. కోరిన కోరిన కోరికలు నెరవేర్చే ఇలవేల్పుగా ఇక్కడి ప్రాంత ప్రజల నమ్మకం. ఈ జాతర సందర్భంగా సుమారు 20 వేలకు పైగా భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. జాతరలో ప్రత్యేక ఆకర్షణగా రంగుల రాట్నాలు నిలిచాయి. జాతరకు వచ్చిన భక్తుల్లో చిన్నలు పెద్దలు ఈ రంగుల రాట్నాలపై కూర్చోవడానికి చాలా ఇష్టపడతారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కుస్తీ పోటీలకు తరలివచ్చిన మల్ల యోధులు

జాతరలో భాగంగా శుక్రవారం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయలతో జాతరలో కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణ నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం మల్ల యోధులు తరలివచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కుస్తీ పోటీలు మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. వీటిని తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. కుస్తీ పోటీల్లో పాల్గొన్న వారికి భోజన వసతితో పాటు పారితోషికాన్ని అందించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు సుమారు 22 క్వింటాళ్ల బియ్యంతో అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వారు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించి భక్తులకు మందులను అందజేశారు. ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ముథోల్, లోకేశ్వం ఎస్సైలు సంజీవ్, జి.అశోక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. జాతరకు భైంసా నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిచాయి. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, సాయంరెడ్డి, విఠల్‌రెడ్డి, భూమన్న, రవీందర్ రెడ్డి, నిమ్మ పోతన్న, గురుప్రసాద్ యాదవ్, రాములు, మాణిక్ రెడ్డి, లక్ష్మణ్, ఉదయ్, మల్లేష్, సుదర్శన్, విఠల్ యాదవ్, ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.


నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్న భక్తులు




ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


రంగుల రాట్నాలు

కుస్తీ పోటీల ఫైనల్ విజేత మహారాష్ట్ర వాసి

ముథోల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ మల్లన్న దేవుడి జాతరలో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం నిర్వ హించిన కుస్తీ పోటీల్లో ఫైనల్ విజేత గా మహారాష్ట్ర వాసి నాందేడ్‌కు చెందిన రాజు పటేల్ అనే మల్లయోధుడు గెలు పొందాడు. రాజు పటేల్, హన్మంత్ అనే ఇద్దరు మల్ల యోధులు తలపడగా విజేతగా రాజు పటేల్ అనే మల్లయోధుడు ఫైనల్ విజేతగా గెలుపొందాడు. ఈయనకు గ్రామం తరపున రూ. 10 వేలు నగదు ఇవ్వగా గ్రామానికి చెందిన బెజ్జంకి విఠల్ రెడ్డి తన సొంత డబ్బులతో 50 గ్రాముల వెండి కడియంను విజేతకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, రవీందర్ రెడ్డి, నిమ్మ పోతన్న, దత్త్రాత్రి, బి.ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, సాయంరెడ్డి, సాయినాథ్, భూమన్న, సుదర్శన్, నల్ల విఠల్ రెడ్డి, మాణిక్ రెడ్డి, గురుప్రసాద్, మల్లేష్, రావుల గంగారెడ్డి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.


ఫైనల్‌లో పోటీ పడుతున్న మల్లయోధులు


గెలుపొందిన మల్లయోధుడికి వెండి కడియం బహుకరిస్తున్న దృశ్యం

బందోబస్తును పర్యవేక్షించిన అడిషనల్ ఎస్పీ

మండలంలోని మల్లన్న జాతరలో భాగంగా శుక్రవారం భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు వివరాలను సీఐ మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు.

టీచర్స్ కాలనీలో సమస్యలెన్నో..!

● కనీస సౌకర్యాలు కరువు ● అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు ● ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు
● ఖాళీ స్థలాలు.. చెత్తకు నిలయాలు ● వీధి కుక్కల స్వైర విహారం

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా కాలనీలో కనీస సౌకర్యాలు లేక స్థానికులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. కాలనీలోని సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. దాదాపు 5 వేల మంది జనాభా.. 3 వేల ఓటర్లు ఉన్న.. అడుగడుగునా అవే సమస్యలు కనిపిస్తున్నాయి. ఈ టీచర్స్ కాలనీ సమస్యలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు

ఈ టీచర్స్ కాలనీలో ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు లేక కాలనీ ప్రజలు నానా ఇబ్బందులు పడతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో వాహనాలు పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి ప్రధాన రోడ్లు గుంతలమయంగా అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో వాహనదారులు ప్రయాణం చేయడానికి జంకుతున్నారు. అలాగే మురికి కాల్వల నిర్మాణం సరిగ్గా లేక అపరిశుభ్ర వాతావరణ నెలకొంది.. స్థానికంగా ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేక మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కాల్వల శుభ్రం చేసే పనులు నెలల తరబడి నిర్వహించగా.. ఈగలు దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు.


ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

కనీస సౌకర్యాలు కరువు

పట్టణంలో ప్రతి కాలనీలో కాలనీ ఉండే సౌకర్యాలు ఈ కాలనీలో లేవు. బస్తీ దవాఖానా కూడా లేక పేద మధ్య తరగతి కుటుంబీకులు ఇబ్బందులు పడతున్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం అందించేందుకు పట్టణంలోని పలు కాలనీలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు కూడా ఇక్కడ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఖాళీ స్థలాలు.. చెత్తకు నిలయాలు

ఈ కాలనీలో రోజు చెత్త సేకరణ జరగక డంపింగ్ యార్డులు కూడా లేక ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం దర్శనమిస్తోంది. ప్రజలు ఖాళీ స్థలాలను చెత్త నింపేందుకు ఉపయోగించుకుంటున్న వాతావరణం కనిపిస్తుంది. దీంతో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డ్ లాగా మారిపోతున్నాయి. దీంతో అనారోగ్య వాతావరణం ఏర్పడుతుంది.


టీచర్స్ కాలనీలో అధ్వానంగా మారిన రహదారి

వీధి కుక్కల స్వైర విహారం

కాలనీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పిల్లలు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కాలనీలో పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో స్థానికులు భయం భయంగా వెళ్లే పరిస్థితి నెలకొంటుంది.

కనీస సౌకర్యాలు లేవు..

● సోంబాయి, కాలనీవాసి



మా కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నాయి. పేరుకే టీచర్స్ కాలనీ కానీ ఇక్కడ కనీస సౌకర్యాలు సరిగ్గా లేవు.ప్రధాన రోడ్లు బాగాలేక, కాలనీలో అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో కొన్ని ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కాలనీలో డ్రైనేజీ శుభ్రత లేక.. మురుగు నీరు చెత్త చెదారంతో దుర్గంధం వెలజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

అభివృద్ధి అనేది లేదు..

● నారాయణ రావు, కాలనీవాసి



మా కాలనీలో పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఉన్నారు. ఇతర కాలనీల్లో ఉన్నట్లు ఇక్కడ బస్తీ దవాఖాన లేదు. దీంతో మేము చిన్నపాటి లాంటి వాటిని కూడా పెద్ద ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. అదేవిధంగా ఇక్కడ ఆహ్లాదం ఆరోగ్యానికి సంబంధించి అర్బన్ పార్క్, ఓపెన్ జిమ్‌లు కూడా లేవు.. అదే విధంగా ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం ఉండడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదు. దీంతో దుర్గంధం వెదజల్లడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు కాలనీ అభివృద్ధిపై దృష్టి సారించాలి.

కాలనీ అభివృద్ధి శూన్యం..

● ముడుపు మౌనిష్ రెడ్డి,
సామాజిక కార్యకర్త, కాలనీ వాసి



ఆదిలాబాద్ పట్టణంలోనే వెనుకబడిన కాలనీ అంటే.. టీచర్స్ కాలనీ అని చెప్పవచ్చు. 3 దశాబ్దాలుగా కాలనీ అభివృద్ధికి లేదు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. కాలనీలో టాక్స్ రికవరీ 100 శాతం జరుగుతున్న అభివృద్ధి మాత్రం శూన్యం. గత ప్రభుత్వం వివక్ష చూపడం. గెలిచిన నాయకులు నిధులు తెచ్చుకునే ప్రయత్నం చేయకపోవడంతో.. కాలనీ అభివృద్ధిలో వెనుకబడి పోయింది. కాలనీలో చాలా చోట్ల రోడ్లు లేవు. దీం తో ఖాళీ స్థలాల్లో నీరు వెళ్లడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. కాలనీలోని పలు వీధుల్లో సొంత డబ్బుతో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. అదే విధంగా కాలనీలోని పలు ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందించాను. రానున్న రోజుల్లో కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తూ ఉంటాను.

గత పాలకుల నిర్లక్ష్యం..అభివృద్ధికి దూరం

● ఎండీ సిరాజ్, కాలనీవాసి



మా కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పదేళ్లలో కాలనీలో ఎక్కడ రోడ్ల నిర్మాణాలు జరగలేదు. గత ప్రభుత్వ వివక్ష కారణంగా కాలనీకి నిధులు రాక కౌన్సిలర్ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదు కౌన్సిలర్ నిధులు తెచ్చుకునే ప్రయత్నం చేయకపోవడంతో అభివృద్ధికి నోచుకోక వెనుకబడి పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటీవలే మంత్రి సీతక్క చేతుల మీదుగా రూ.1 కోటి 20 లక్షలతో కాలనీ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి.

నిధులు లేక.. అభివృద్ధి లేదు..

● కృష్ణ యాదవ్, కౌన్సిలర్



నేను బీజేపీ తరపున కౌన్సిలర్‌గా ఉన్నాను. అయితే గత ప్రభుత్వం ఆ సమయంలో వివక్ష చూపి కాలనీ అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదు. దీంతో 4 ఏళ్లలో ఎటువంటి అభి వృద్ధిని చేయలేకపోయా. ఇప్పుడున్న కొత్త ప్రభుత్వంలో.. మా కాలనీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పాయల్ శంకర్ సహకారంతో రూ.1 కోటి 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఇటీవలే కాలనీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనుల కోసం భూమిపూజ చేసి పనులను ప్రారంభించాం. ఇప్పుడు ఎలాగైనా నిధులు సాధించి అభివృద్ధి చేసి.. కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతా..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహా రెడ్డి


ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

నిర్మల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువత సమస్యల పరి ష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సమ రసింహా రెడ్డి అన్నారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సమరసింహా రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్ఠతకు మరింత కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి వైపు తీసుకెళ్లడంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు సైతం త్వరలోనే ముఖ్యమంత్రి శుభవార్తను చెబుతారన్నారు. కాంగ్రెస్‌తోనే అభి వృద్ధి సాధ్యమని తమ ప్రభుత్వం ఇప్పటికే నిరూపించుకుందన్నారు. నిర్మల్ జిల్లాలో యువత కాంగ్రెస్ వైపు మరిన్ని అడుగులేసేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.



వృధా భూముల్లో సోలార్ ప్లాంట్‌లు



- జిల్లాలో రెన్యూవబుల్ ఎనర్జీకి శ్రీకారం
- రెడ్కో అండతో ఏర్పాట్లకు సన్నాహాలు
- సోలార్ విద్యుత్‌ను కొనుగోలు చేయనున్న రెడ్కో
- ధర నిర్ణయం ఎన్‌పీడీసీఎల్‌దే
- 25 సంవత్సరాల పాటు అగ్రిమెంట్‌లు
- సొంతానికి వాడుకుంటూనే అమ్ముకునే అవకాశం

నిర్మల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి అనుకూలంగా లేని వృధా భూముల్లో సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రోజురోజుకు థర్మల్ విద్యుత్ వినియోగం పెరిగిపోతుండడం అలాగే ఆ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ఎక్కువగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సోలార్ విద్యుత్‌పై దృష్టి కేంద్రీకరిస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (రెడ్కో) వృధాగా పడి ఉన్న యజమానుల నుంచే కాకుండా భూములు కలిగి ఉండి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న వారందరి నుంచి సోలార్ విద్యుత్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఆసక్తి వ్యక్తీకరణ పేరిట రెడ్కో ఈ దరఖాస్తులను తీసుకునేందుకు ఈ నెల 22వ తేదీ వరకు గడువు విధించింది. సాధారణ రైతులతో పాటు వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సంఘాలు, నీటి వినియోగదారుల సంఘాలు, రైతు సహకార సంఘాలు, స్వయం సహాయక మహిళ బృందాలు, గ్రామ పంచాయతీలు, మండల సమాఖ్య సంఘాలకు సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నారు. అయితే స్థానిక ఎన్‌పీడీసీఎల్ అధికారుల సహకారంతో రెడ్కో ఈ సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వస్తోంది. కాగా ఎన్‌పీడీసీఎల్ అధికారులు సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటుపై గ్రామ గ్రామాన విస్తృతస్థాయిలో ప్రచారాన్ని చేపడుతున్నారు. వృధాగా ఉన్న భూమి యజమానులందరికీ ఈ సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు.

అద్దె భూములకూ అవకాశం

రైతుల భూములను లీజుకు తీసుకొని సరియైన ఒప్పందం ద్వారా డెవలపర్స్ పేరిట సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లోనే సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యనివ్వనున్నారు. రైతులే కాకుండా రైతుల భూములను లీజుకు తీసుకొని సరియైన అగ్రిమెంట్‌ను కలిగి ఉన్న వారికి కూడా అవకాశం కల్పించనున్నారు. అయితే భూములకు సంబంధించిన అన్ని రకాల యాజమాన్య హక్కులను కూడా దరఖాస్తుల సమయంలో పరిగణలోకి తీసుకోనున్నారు.

25 సంవత్సరాల పాటు అగ్రిమెంట్

సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి 25 సంవత్సరాల పాటు నిరాటంకంగా ఆదాయం సమకూరనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు దగ్గరగా ఉన్న భూములకు ప్రాధాన్యతనివ్వనున్నారు. దీని కారణంగా విద్యుత్‌లైన్ ఏర్పాటు ఖర్చులు తక్కువగా కానున్నాయి. కాగా 500 కిలోవాట్ల నుంచి రెండు మెగావాట్ల వరకు ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలంటే మూడున్నర ఎకరాల నుంచి నాలుగు ఎకరాల భూమి అవసరం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఈ సోలార్ విద్యుత్‌ప్లాంట్‌ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఎన్‌పీడీసీఎల్‌తో పాటు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యూలేటరీ కమిషన్ నిర్ణయించిన టారిఫ్‌కు కొనుగోలు చేయనున్నారు. ఒక సోలార్ ప్లాంట్ నిర్వహణకు గరిష్ఠంగా 25 ఏళ్ల పాటు నిర్వహణతో ఖరారు చేస్తున్నారు. సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి 25 ఏళ్ల పాటు ఉత్పత్తి అయ్యే విద్యుత్ ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సోలార్‌ప్లాంట్ ఏర్పాటుతో స్థిరమైన ఆధాయం వస్తుందని ఎన్‌పీడీసీఎల్ అధికారులు భరోసానిస్తున్నారు.

సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటును ప్రోత్సహిస్తాం..

బి. సుదర్శనం, ఎస్‌ఈ, నిర్మల్ సర్కిల్, ఎన్‌పీడీసీఎల్

సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటు ద్వారా 25 ఏళ్లపాటు స్థిరమైన ఆదాయం సమకూరుతోంది. జిల్లాలో రైతులు, వృధాగా ఉన్న భూముల యజమానులు, మహిళ పొదుపు సంఘాలు, గ్రామ పంచాయతీలు, మండల సమాఖ్యలు, రైతుల భూములను లీజుకున్న వారు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలి. జిల్లాలో నాలుగు వేల మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టబోతున్నాం. దీనికి అనుగుణంగా విస్తృతస్థాయిలో ప్లాంట్‌ల ఏర్పాటుకు సంబంధించి ప్రచారం చేపట్టాం. ఆసక్తి ఉన్న వారు నిర్మల్ ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో సంప్రదించాలి.



ఘనంగా పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవం



జాతరకు వచ్చిన భక్తులు

పెంబి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోనిమందపల్లి గ్రామంలో గల పెద్దమ్మ తల్లి కల్యాణం.. జాతర మహోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు గత వారం రోజుల నుంచి పెద్దమ్మ, భీమన్న గజాలతో ఊరిలోని వాడవాడలో శోభాయాత్ర నిర్వహించారు. బుధవారం గంగా స్థానానికి వెళ్లి అదే రోజు తిరిగి వచ్చి శుక్రవారం ఘనంగా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరలో పెద్దమ్మ తల్లికల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం అగ్ని గుండాలు నిర్వహించి భక్తులు తమ తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ జాతర సందర్భంగా భక్తులు కేశఖండన, తులాభారాల మొక్కులను చెల్లించుకున్నారు. ఈ జాతరకు జిల్లాతో పాటుగా ఇతర జిల్లాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ జాతరలో పూజారులు అర్జన్న, విష్ణు, ముదిరాజ్ సంఘం పెద్దలు భీమ లింగు, పోశన్న, నరేందర్, భీమరాజు, శ్రీనివాస్, ముదిరాజ్ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఐఈవో



కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో పరుశురాం

కుంటాల, ఫిబ్రవరి, 14 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం డీఐఈవో పరుశురాం, డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్లు రవి కిరణ్, సంజీవ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గోవింద్ సాయిలు, తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

- నలుగురు యువకుల అరెస్టు

ముథోల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారంకు పాల్పడ్డ నలుగురు యువకులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతిపై మండలంలోని మరో గ్రామానికి చెందిన నలుగురు యువకులు యువతికి కొన్ని రోజుల నుంచి మాయ మాటలు చెప్పుకుంటూ గ్రామం చివరకు తీసుకెళ్లి యువతిపై అత్యాచారంకు పాల్పడ్డారు. బుధవారం కూడా యువతిని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నలుగురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి ఇష్టం లేదని

యువకుని ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కుబీర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పెద్దలు కుదిరించిన పెళ్లి ఇష్టం లేదని ఓ యువకుడు ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని బేల్గాం తండా(2) చోటు చేసుకుంది. కుబీర్ ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... కుబీర్ మండలంలోని బెల్గాం తాండా (2) కి చెందిన జాదవ్ రోహిదాస్(30) కు, డొడర్న తండా(1)కి చెందిన ఓ యువతితో పెద్దలు పెండ్లీ కుదిర్చారు. ఈ నెల 17న సోమవారం పెండ్లి ఉండగా పెండ్లి ఇష్టం లేదని రోహిదాస్ కుటుంబ సభ్యులకు తెలిపారు. పెండ్లికి కావాల్సిన వస్తువులు, సామాగ్రి, బట్టలు కొనుగోలు చేశామని పెండ్లి పత్రికలు సైతం బంధువులందరికి ఇచ్చామని ఇప్పుడు ఇష్టం లేదనడం సరికాదని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురయి గురువారం సాయంత్రం 6గంటలకు ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు వెతకగా తమ స్వంత చేన్లోని చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడు రోహిదాస్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేశాడు. మృతుడి తండ్రి జాదవ్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో పురుగుల

మందు తాగి ఒకరి ఆత్మహత్య

సోన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామానికి చెందిన దండుగుల కార్తీక్(30) అనే వ్యక్తి గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే దండుగుల కార్తీక్(30) ఒక సంవత్సరం నుండి మద్యానికి బానిసై మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మృతుడి అన్న దండుగుల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో

వృక్షార్చన పోస్టర్ల ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్‌లో గల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమన్వయకర్త కే. రాంకిషన్ రెడ్డి వృక్షార్చన పోస్టర్లను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమ ప్రభుత్వ హయాంలో పర్యావరణ పరిరక్షణ కోసం వినూత్న కార్యక్రమాలు నిర్వహించి ముందు కెళ్లామన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

- విద్యాశాఖ రాష్ట్ర కార్యదర్శి యోగితారాణా
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీ, సమగ్ర నిధులతో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పాఠశాలలకు మంజూరైన సమగ్రశిక్ష, పీఎంశ్రీ నిధుల వినియోగాన్ని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా నిధులు వినియోగించాలన్నారు. పాఠశాలల్లో సివిల్ పనులు, క్రీడా సామాగ్రి, విద్యార్థులతో పలు కార్యక్రమాల నిర్వహణకు నిధులు వినియోగించాలన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, నిధుల వినియోగాన్ని వివరించారు. పీఎం శ్రీ, సమగ్ర శిక్ష నిధులతో క్రీడాపకరణాలు కొనుగోలు చేశామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు సామాగ్రి కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఈ నిధులతో పలు రకాల ప్రత్యేక దినోత్సవాలు నిర్వహించినట్టు స్పష్టం చేశారు. కలెక్టర్‌తో పాటు డీఈవో రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో 10వ తేదీ నుంచి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తా రహదారి విభాగిని మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. విద్యార్థులంతా పాఠశాల స్థాయినుంచే పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కలెక్టర్ అన్నారు. సమాజంలో మెరుగైన పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులు కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పట్టణాన్ని స్వచ్ఛ నిర్మల్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఈవో పి. రామారావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీఈ హరిభువన్, అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రహదారి మధ్యలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతీ ఒక్కరు ఆధార్ కార్డును కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు ఆధార్‌కార్డును కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ ప్రాంతీయ ఆధార్ కార్యాలయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ఆధార్ కేంద్రాలలో సులువుగా ఆధార్ నమోదు, పేరు, చిరునామా తదితర వివరాలు మార్పులు, చేర్పులు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకేంద్రంలోని బ్రహ్మపురిలో గల ప్రధాన తపాలా కార్యాలయంలో పూర్తిస్థాయి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా అవకాశాన్ని వినియోగించుకొని నూతన ఆధార్ కార్డు, ఆధార్‌లో మార్పు చేర్పులు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్ సేవలలో సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులలో ఆధార్ సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో శిశువులు జన్మించిన వెంటనే వారి తల్లిదండ్రుల నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకొని శిశువులకు తగు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు కలిగి ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్ కార్డులలో మార్పులు చేర్పులకు సంబంధించి సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. త్వరలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, ఆధార్ కార్డులలో తప్పుగా ముద్రించబడిన వివరాలను సరిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పాఠశాలలను విద్యార్థుల ఆధార్ కార్డులలో తప్పులు ఉన్నట్లుగా గుర్తిస్తే వాటిని సరి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఈవో పి.రామారావు, పోస్ట్‌మాస్టర్ వెంకటరావు, డీటీడీవో అంబాజీ, సీడీపీవో నాగలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు స్థానిక సెలవు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు శనివారం సంత్ సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు గాను ఉత్సవ కమిటీ వినతి మేరకు సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు. మార్చి 8 రెండవ శనివారం పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

మా బిడ్డను చంపిన కేసులో మిగతా ఇద్దరికీ శిక్ష పడేలా చూడండి

- ఏ-1కి మాత్రమే శిక్ష వేసి ఏ-2, ఏ-3లను వదిలేశారు
- వారితో మా కుటుంబానికి ప్రాణహాని ఉంది
- జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు అలేఖ్య కుటుంబ సభ్యుల వినతి
- హైకోర్టులో అప్పీల్ చేస్తామని అలేఖ్య కుటుంబ సభ్యులకు ఎస్పీ హామీ

ఖానాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మా బిడ్డను చంపిన కేసులో మిగతా ఇద్దరికీ శిక్ష పడేలా చూడాలంటూ గత ఏడాది ఫిబ్రవరిలో ఖానాపూర్‌లో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన అలేఖ్య తల్లిదండ్రులు గంగవ్వ, గంగారాంలు జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు విన్నవించుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిలను అలేఖ్య కుటుంబ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా తమ కూతురును అత్యంత దారుణంగా హత్య చేయడానికి కారకులైన ముగ్గురు నిందితుల్లో ఒకరికి మాత్రమే శిక్ష వేసి మిగతా ఇద్దరిని వదిలేయడం తమను బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కూతురు హత్యలో ఏ-2, ఏ-3లది కూడా ప్రధాన పాత్ర ఉందని వారికి కూడా సరైన శిక్ష వేస్తేనే తమ కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఎస్పీతో తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న జుకింది శ్రీకాంత్‌కు బుధవారం జీవిత ఖైదుతో పాటు రూ. 1000 జరిమానాను విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో మిగతా ఇద్దరికీ ఎటువంటి శిక్ష పడకపోవడంతో వారితో తమకు ప్రాణహాని ఉందని అలేఖ్య కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన జిల్లా ఎస్పీ జానకి షర్మిల అలేఖ్య హత్య కేసులో మిగతా ఇద్దరు నిందితులకు శిక్ష పడేలా హైకోర్టులో అప్పీలు చేస్తామని హామీ ఇచ్చారు.

కోళ్ల ఫారాలను పరిశీలించిన వెటర్నరీ డాక్టర్



కోళ్ల ఫారం పరిశీలిస్తున్న దృశ్యం

కడెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీఫామ్స్‌లో కోళ్లకు వ్యాధులు సోకితే వెంటనే వెటర్నరీ అధికారులకు సమాచారం అందించాలని కడెం మండల వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ సౌందర్య సూచిం చారు. శుక్రవారం మండలంలోని పాండ్వాపూర్, అంబారిపేట్ గ్రామాల్లోని పౌల్ట్రీఫామ్స్‌ను ఆమె సందర్శించి కోళ్లను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బర్డ్ ఫ్లూ వ్యాధి ముందస్తు జాగ్రత్తలు భాగంగా కోళ్లను పరిశీలించి, వాటికి సోకే వ్యాధులపై అవగాహన కల్పించిన సూచనలు చేశారు.

ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసా రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన భైంసా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డీఆర్డీవో విజయలక్ష్మి ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని నర్సరీల నిర్వహణ, ఉపాధి పనులతో పాటు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో ఉపాధి పనులను సైతం పారదర్శకంగా చేపట్టాలన్నారు. నర్సరీల నిర్వహణలో లోపాలకు తావు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శివలింగం, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

17న ఇసుక వేలం పాట

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక వేలం పాటను నిర్వహిస్తున్నామని రూరల్ తహసీల్దార్ సంతోష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 17న ఉదయం 11 గంటలకు మంజులాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు.